క్లుప్తంగా

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం జానంపేటలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ హాజరై మాట్లాడారు. మండలంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తూ, నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములుయాదవ్, వింగ్ డైరెక్టర్ నరసింహ, గంగాధర్‌యాదవ్, ఉమర్, రాజు, ఇమ్రాన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే చెత్త



పాన్‌గల్: పంచాయతీ కార్మికులు 25 రోజులుగా సమ్మె చేస్తుండటంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రోడ్లపై చెత్తా పేరుకుపోయి పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. దీంతో దురువాసనతో పాటు ఈగలు, దోమలు వృద్ధి చెంది, రోగాలు సంభవిస్తాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉండడంతో కార్యాలయం సిబ్బందికి, అక్కడికి వచ్చే ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలని సిబ్బంది, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే వెనకబాటు



కొల్లాపూర్: పాలకుల నిర్లక్ష్యం వల్లే నియోజకవర్గ అభివృద్ధి చెందడం లేదని కాంగ్రెస్ నేత చింతలపల్లి జగదీశ్వర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. స్థానికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్‌సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆదరించాలని కోరారు. ఆయన వెంట నాయకులు రంగినేని జగదీశ్వరుడు, రాముయాదవ్, పరశురాంనాయుడు, ఖాదర్‌పాష, జహంగీర్, నాగన్న, కాంతారావు తదితరులున్నారు.

5న ప్రియాంకగాంధీ రాక

బిజినేపల్లి: ఆగస్టు 5వ తేదీన కొల్లాపూర్‌లో నిర్వహించే బహిరంగ సభకు కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ గిరిజన యూత్ ప్రెసిడెంట్ సురేష్ అన్నారు. ఆదివారం తిమ్మాజీపేట మండల కేంద్రంలో సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సురేష్ నాయక్, రమేష్, సెహ్వాగ్, రాము, విజయ్, లక్ష్మీరాంనాయక్, హనుమంతు, శ్రీను, శివకుమార్, విష్ణుసాల్‌రెడ్డి, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయండి



మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి స్టేజీ సమీపంలో గద్వాల–అయిజ ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిపై పెద్దఎత్తున గోతులు ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయిజ నుంచి 3 కిలోమీటర్ల మేర బీటీ నిర్మించి మధ్యలో వదిలేయడంతో ప్రమాదకరంగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

‘రైతుబీమా’తో భరోసా

- బాధిత కుటుంబానికి రూ.5 లక్షల సాయం
- దరఖాస్తుకు ఆగస్టు 5 వరకు గడువు



పాన్‌గల్ శివారులో ఎద్దులతో కరిగెట చేస్తున్న రైతు

పాన్‌గల్: రైతులను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన రైతుబీమా పథకంలో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అనారోగ్యం లేదా ప్రమాదవశాత్తు ఏ విధంగా అయినా రైతు మృతి చెందితే బాధిత కుటుంబానికి రూ.5లక్షలు సాయం అందిస్తోంది. 2018వ సంవత్సరం నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్న ఈ పథకానికి అవసరమైన ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తోంది. రైతు మృతి చెందితే కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న వ్యవసాయ అధికారులకు సమాచారం అందిస్తే వారే క్షేత్రస్థాయిలో విచారించి పరిహారం అందిస్తారు. అర్హులైన రైతులు ఆగస్టు 5వ తేదీలోగా స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుంది.

అర్హతలివే..

- పొలానికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉండాలి
- ఆధార్‌కార్డులో 18 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉండాలి.
- ఈ ఏడాది జూన్ 18 వరకు పట్టా పాసు పుస్తకం పొందిన రైతులు మాత్రమే అర్హులు
- ఎన్ని చోట్ల భూమి ఉన్నా బీమాకు మాత్రం ఒకచోటనే అర్హులు. సంబంధిత రైతులు వారే స్వయంగా కార్యాలయానికి వెళ్లి అధికారి సమక్షంలో దరఖాస్తు అందజేయాలి. పట్టాపాసు పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను ఆగస్టు 5వ తేదీలోగా వ్యవసాయ అధికారులకు అందజేయాలి.

రైతుల వివరాలు...

మండలం	మొత్తం రైతులు	అర్హులైన రైతులు	నూతన రైతులు
చిన్నంబావి	11720	8997	437
పాన్‌గల్	16799	10171	1105
వీపనగండ్ల	11704	8720	537

రైతుబీమాతో కుటుంబాలకు మేలు



రాష్ట్ర ప్రభుత్వం అందజేసే రైతుబీమాతో బాధిత రైతు కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది. రైతు ఏ కారణం చేతనైనా మృతి చెందితే ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ. 5లక్షల సాయం అందించడంతో ఆ కుటుంబానికి ఎంతో భరోసా లభిస్తుంది. – ఎనుముల స్వామి, రైతు, పాన్‌గల్.

అవగాహన కల్పించాలి



రైతు బీమాపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలి. బీమా దరఖాస్తుపై రైతులకు అవగాహన లేక దరఖాస్తులు అందజేయడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ అధికారులు క్లస్టర్ల పరిధిలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి బీమాతో కలిగే ప్రయోజనం వివరించాలి. – దేవేందర్, సీపీఎం నాయకుడు

వివరాలు అందజేయాలి



నూతనంగా పట్టా పాసుపుస్తకం పొందిన రైతులు రైతు బీమా కోసం ఆగస్టు 5 లోగా దరఖాస్తు చేసుకోవాలి. పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలతో పాటు, నామినీ వివరాలతో స్థానిక వ్యవసాయ విస్తరణాధికారికి దరఖాస్తులు అందజేయాలి. – చంద్రశేఖర్, ఏడీఏ, పాన్‌గల్

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొత్తకోట రూరల్: మండలంలోని నాటవెల్లి మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎద్దుల నాగేష్ తల్లి లక్ష్మీదేవమ్మ(70) ఆదివారం మృతి చెందింది. స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం నాటవెల్లికి చేరుకొని లక్ష్మీదేవమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, చెన్నకేశవరెడ్డి, పి.విశ్వేశ్వర్, ఆకుల శ్రీనివాసులు, గాడీల ప్రశాంత్, వడ్డె శ్రీనివాసులు, గుంత మల్లేష్, అల్లబాష, కె.శ్రీనివాస్‌జీ, కృష్ణయ్యగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిట్యాలకు చెందిన పోగుల భగవంతు ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి జిల్లెల చిన్నారెడ్డి స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ, మాజీ వైస్ ఎంపీపీ సురేష్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు రోహిత్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేటకు చెందిన పెద్ద కిష్టమ్మ అనారోగ్యంతో ఆదివారం మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ స్థానిక నాయకులతో కలిసి ఆదివారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాములు యాదవ్, గంగాధర్, ఉమర్, అమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గద్వాల కృష్ణకు గత నెల మాతృవియోగం చెందడంతో ఆదివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతిరాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గంధం గట్టయ్య, కేశవులు, రత్నం ఉన్నారు.



చిట్యాలలో మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి



వనపర్తిలో నివాళులర్పిస్తున్న మంద కృష్ణ మాదిగ



నాటవెల్లిలో లక్ష్మీదేవమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూడు రోజులుగా నిలిచిన తాగునీట సరఫరా

గోపాల్‌పేట: మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిసారి ఇదే పరిపాటిగా మారిందని ప్రజలు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయంపై మిషన్ భగీరథ ఏఈ మొగులయ్యను వివరణ కోరగా గౌరిదేవిపల్లి నుంచి నీరు తీసుకుని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నామని, ప్రస్తుతం రేవల్లి మండలంలో కరెంట్ సమస్య ఏర్పడటంతో సమస్య తలెత్తిందని, రామన్‌పాడ్ నుంచి నీటని తీసుకుని శుద్ధి చేసి సరఫరా చేసుస్తున్నామన్నారు. ఆదివారం నుంచి మోటార్లు ప్రారంభం అయ్యాయని, ఎప్పటిలాగే నీటి సరఫరా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

కాలువ పూడికతీతకు రూ.30వేల అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శంకరసముద్రం 19వ ప్యాకేజీ కెనాల్‌లో పూడిక తీసేందుకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తన వంతు సహాయంగా రూ.30వేలు అందజేశారు. కెనాల్‌కు మోటార్లను ఏర్పాటు చేసేందుకు గతంలో రూ.10లక్షల నిధులు ఇవ్వడంతో పాటు ఈ ఏడాది కాల్వ పూడిక తీసేందుకు ఆర్థికసాయం అందజేసిన ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

వర్గీకరణ సాధించే వరకు పోరాడుతాం

కొల్లాపూర్: వర్గీకరణ సాధించే వరకు పోరాడుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రమోని యాదగిరి మాదిగ అన్నారు. ఆదివారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాదిగ మాట్లాడారు. ఆగస్టు రెండోవారంలో మందకృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహించబోయే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అగ్రస్వామి, కొండూరు రాములు, వడ్డెమాన్ రాములు, సులిగిరి శ్రీనివాసులు, బచ్చలకూర లక్ష్మణ్, పరమేష్, చక్రవర్తి, రాజు ఉన్నారు.

నదీతీర ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలి



ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి వరద చేరుతుండడంతో దిగువకు నీటిని వదులుతున్నారు. నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సింధూజ అన్నారు. మండలంలోని రేచింతల, జూరాల, వీరరాఘవపూర్, ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి, మెట్లంపల్లి, గుంటిపల్లి గ్రామాల రైతులు, మత్స్యకారులు నది సమీప ప్రాంతాలకు వెళ్లకూడదని సూచించారు. నదిలో వేసుకున్న మోటార్లు, వలల కోసం వెళ్లకూడదని నీటి ఉధృతికి కొట్టుకుపోయే అవకాశం ఉందని, ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

నిన్న అనావృష్టి.. నేడు అతివృష్టి

- నీరు పట్టిన పత్తి చేను
- మండలంలో 2,100 ఎకరాల్లో సాగు
- ఆందోళనలో రైతులు



అప్పారెడ్డిపల్లిలో అధిక వర్షాలకు నీరు పట్టిన పత్తి పంట

ఖిల్లాఘనపురం: మండలంలో అధిక వర్షాలతో పత్తి పంట నీరుపట్టి పాడై పోతుంది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలో వర్షాలు సరిగా కురవకపోడంతో విత్తనాలు నాటేందుకు రైతులు ఇబ్బందులు పడారురు. నేడు ఎడతెరపి లేకుండా కురుస్తుండటంతో రైతులు ఆదందోళనకు గురవుతున్నారు.

12 రోజులుగా వానలు

మండలంలోని సల్కెలాపురం, మామిడిమాడ, పర్వతాపురం, అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, అల్లమాయపల్లి తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా పత్తి పంట సాగు చేశారు. ఈ ఏడాది 2,100 ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలో 12 రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో పొలాలు నీరు చేరి మొక్క వేర్లు కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

కాపరాక్సి క్లోరైడ్ పిచికారీ చేయాలి



వర్షాకాలం ప్రారంభం నుంచి జిల్లాలో వర్షాలు ఎక్కడా సరిగా కురవలేదు. దీంతో తడి సరిపోక మండలంలో పత్తి సాగు చేసుకున్న రైతులు రెండు మూడు సార్లు విత్తనాలు విత్తుకోవాల్సి వచ్చింది. కానీ ఇప్పుడు ఆగకుండా వర్షాలు కురవడం వలన నల్లరేగడి, చవుడు నేలల్లో పంట నీరు పట్టింది. ఇందుకు రైతులు కాపరాక్సీ క్లోరైడ్ మందును లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి పత్తి పంట మొదళ్ల వద్ద పిచికారీ చేయాలి. ఎర్ర నేలలు, ఇసుక నేలల్లో ఎలాంటి ఇబ్బంది లేదు త్వరలోనే పంట కోలుకుంటుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పంటకు దోమ పట్టడం, ఆకులు పెడుసుగా ఉంటే పరిశీలించి వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలి. – మల్లయ్య, ఏఓ, ఖిల్లాఘనపురం

వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలకు చెందిన చారకొండ లక్ష్మి గతేడాది ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేక చదువు మానేసే పరిస్థితి రావడంతో స్పందించిన వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి లక్ష్మికి మొదటి ఏడాది రూ.లక్ష చెల్లించారు. మంచి మార్కులతో పాస్ అవ్వడంతో అమ్మాయిని మంత్రి అభినందిస్తూ రెండో సంవత్సరం ఫీజు రూ.లక్ష చెక్కును ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. తన చదువుకు సహకారం అందిస్తూ ఆర్థికంగా ఆదుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డికి లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ నిర్మల, ఉపసర్పంచ్ చంద్రాయుడు, నాయకులు పృథ్వీరాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఉండగా ఉంటాం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

ఆత్మకూర్: ముసురు వాన కారణంగా నివాసముంటున్న గుడిసె కూలిపోయి రోడ్డున పడ్డ కుటుంబానికి ఆర్థికంగా సహకరించి వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అండగా నిలిచారు. మండలంలోని పిన్నంచర్ల సువర్ణ, రాజు దంపతులు కూలి పనులు చేసుకుంటూ గుడిసెలో నివాసముంటున్నారు ముసురు వానతో గుడిసె కూలిపోవడంతో నిరాశ్రులయ్యారు. విషయం తెలుసుకున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఇంటి నిర్మాణం కోసం పూర్తిగా సహకరిస్తానని భరోసానిచ్చారు. రూ.75 వేలతో రేకులు, ఇటుకలు, సిమెంటు ఇతర సామగ్రిని అందజేస్తామన్నారు. ముందస్తుగా రూ.5వేలు నగదు, నెలకు సరిపడా సరుకులను అందించారు. కార్యక్రమంలో కుర్మన్న, మాసన్న, నారాయణ, ఖాజన్న, సత్యన్న, శివ, నరేష్, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

అమరచింత: వర్షాల కారణంగా మట్టిమిద్దెలు కూలిన బాధితులను వీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదుకుంటామని ఆ సంస్థ నిర్వాహకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంగలి నాగమణి, కాడ్గి లక్ష్మణ్ ఇళ్లు వర్షాలకు కూలిపోవడంతో వారిని వర్కటం పరామర్శించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను అందిస్తామని భరోసా కల్పించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వర్షాలకు కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులకు తమ సంస్థ ద్వారా చేతనైన సహాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్, నాగరాజ్, అభిరామ్, అఖిల్, రాజేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం సరికాదు



మాట్లాడుతున్న సర్పంచ్ సురేందర్‌సింగ్

చిన్నంబావి: గ్రామాభివృద్ధిపై ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బహిరంగ చర్చకు రావాలని పెద్దదగడ సర్పంచ్ సురేందర్‌సింగ్ సవాల్ విసిరారు. ఆదివారం మండలంలోని పెద్దదగడలో స్థానిక ఎంపీటీసీ పుష్పవతి, చిన్నంబావి సర్పంచ్ రంజిత్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌సింగ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తాను నిరంతరం పాటుపడుతుంటే తనను అడగకుండా గ్రామానికి చెందిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అనుచరులు జెడ్పీటీసీ అడ్డుపడుతున్నారనేది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత గ్రామాన్ని దత్తత తీసుకుంటామన్నారు. మరి అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన గ్రామానికి ఎన్ని నిధులు ఇచ్చారో వివరించాలని డిమాండ్ చేశారు. తాను సర్పంచ్‌గా ఉండి గ్రామ పంచాయతీ నుండి రూ.కోటి ఖర్చు చేసి అభివృద్ధి చేశానన్నారు. గ్రామానికి రావాల్సిన రైతువేదికకు తాను ఎమ్మెల్యే అనుచరులకు కమీషన్ ఇవ్వకపోవడంతోనే గ్రామం నుంచి తరలించారని ఆరోపించారు. బాలికకు పెళ్లి చేసి కల్యాణలక్ష్మి పథకం కోసం సర్పంచ్‌గా తన సంతకం పెట్టాలని ఒత్తిడి చేశారని దుయ్యబట్టారు. గ్రామంలో భూకబ్జాలు చేసి కమీషన్ల కోసం అమాయక ప్రజలను మోసం చేసి రూ.లక్షలు కాజేశారన్నారు. గ్రామంలో దళితులకు సంబంధించిన ఎకరాకు రూ.40 లక్షలు డిమాండ్ చేసే భూమిని ఎమ్మెల్యే బంధువులు, గ్రామానికి చెందిన అనుచరులు కలిసి వారిని భయపెట్టి ఎకరానికి రూ.4 లక్షలు ఇచ్చిన మాట వాస్తవం కాదా అన్నారు. గ్రామానికి చెందిన కొంతమంది రాజకీయ ప్రాబల్యం కోసం తనపై, మాజీ మంత్రి జూపల్లిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. తనని విమర్శించే ఎమ్మెల్యే అనుచరుడిగా చెప్పుకునే ఓ నాయకుడు జూపల్లితో లబ్ధి పొంది ఇప్పుడు ఆయనపై ఆరోపణలు చేయడం తగదన్నారు. నోటిని అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే సమాధానం చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భగవద్గీత బోధించిన జగద్గురువు శ్రీకృష్ణుడు



తిర్మలయపల్లిలో త్రైత సిద్ధాంత ప్రచారం చేస్తున్న సభ్యులు

మదనాపురం: విశ్వలోక కల్యాణం కోసం జగద్గురు శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధించారని, ఆయనే గుణాతీత గురువు అని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి కొత్తకోట, మదనాపురం మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు తిర్మాలయపల్లిలో త్రైత సిద్ధాంతం భవద్గీతపై ప్రచారం నిర్వహించారు. గురువు అనే పదానికి వచ్చిన మూల్యాంకాలను ఆయన వివరించారు. సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మను జగద్గురువుగా భావించి పూజలు చేయాలని కోరారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత సిద్ధాంత భగవద్గీతలో శ్రీకృష్ణుని నిజం స్వరూపం పొందుపరిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, జాంగీర్, శివ, తిమ్మమ్మ, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ తదితరులు పాల్గొన్నారు.

అక్క మహాదేవి గుహల వద్ద పర్యాటక అభివృద్ధి

- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు చిత్రపటం అందజేస్తున్న వీరశైవ లింగాయత్‌లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కర్ణాటక, మహారాష్ట్ర భక్తులతోపాటు లింగాయత్‌లకు ఎంతో పవిత్రమైన అక్కమహాదేవి ఆలయం గుహల వద్ద పర్యాటకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన వీరశైవ లింగాయత్ వధూవరుల పరిచయ వేదిక 2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే రూ.1.60 కోట్ల పర్యాటక శాఖ నిధులతో కృష్ణానదిని ఆనుకుని ఉన్న అక్క మహాదేవి గుహ వద్ద మెట్లు, జెట్టి ఏర్పాటు చేస్తున్నామన్నారు. పర్యాటకుల కోసం బోట్ సౌకర్యం కూడా కల్పిస్తున్నామని వివరించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కృష్ణానది, నల్లమల అటవీ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పర్యాటకులను ఆకట్టుకుంటామన్నారు. మహబూబ్‌నగర్ లో వీరశైవ లింగాయత్ వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయడం మంచి పరిణామమని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతే అధికారికంగా బసవేశ్వరుని జయంతి నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి బసవ భవన్ 3 వేల గజాల్లో బ్రహ్మాండంగా నిర్మించామని తెలిపారు. ట్యాంక్ బండ్ పై బసవేశ్వరుని విగ్రహం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.